
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 30 అక్టోబరు 2024





శ్రీకాకుళంలో బాణసంచా విక్రయాలకు ఏర్పాట్లు

8 లో

బాణసంచా విక్రయాల్లో నిబంధనలు పాటించాల్సిందే



ఆ పేలుడు ఘటనకు 20 ఏళ్లు

ఆ దుర్ఘటన జరిగి 20 ఏళ్లు కావస్తోంది. దాన్ని జిల్లా వాసులు ఇప్పటికీ మర్చిపోలేక పోతున్నారు. శ్రీకాకుళంలోని బాణసంచా విక్రయకేంద్రంలో పేలుడు సంభవించి 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు దూరంగా ఉన్న ఓ చిన్నారి సైతం బలైంది. సహాయక చర్యల్లో ఉన్న కానిస్టేబుల్ కూడా మృత్యువాత పడ్డారు. పదుల సంఖ్యలో క్షతగాత్రులయ్యారు.

- చిన్నారి సహా 12 మంది మృతి
- ఇప్పటికీ మరచిపోని జిల్లావాసులు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): దీపావళి వచ్చిందంటే చాలు.. చిన్నారులు, యువకుల్లో ఒకటే సందడి. నెలరోజుల ముందే నుంచే టపాసుల కొనుగోలు.. బాణసంచా తయారీతో బిజీబిజీగా గడుపుతారు. ప్రతి ఇంటా వెలుగులు నింపే.. బాణసంచాతో అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాలు తప్పవు. జిల్లాలో గతంలో పలుచోట్ల జరిగిన ఘటనలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

● 2004 నవంబరు 4న జరిగిన దుర్ఘటనను శ్రీకాకుళం నగరవాసులతోపాటు.. జిల్లా ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరు. శ్రీకాకుళం నగరం చిన్నబజారు రోడ్‌లో పోలిశెట్టి సూరజ్ అనే వ్యక్తి.. భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెతో కలిసి ఇంటి వద్దే బాణసంచా సామగ్రి విక్రయిస్తూ జీవనం సాగించేవారు. ఆ రోజు రాత్రి 8 గంటలకు ఆ ఇంట్లో సంభవించిన భారీ పేలుడు ఘటనలో ఓ పసిపాప సహా 12మంది మృత్యువాత పడ్డారు. మరో ఇరవై మంది వరకు గాయపడ్డారు. పది కిలోమీటర్ల వరకు పేలుడు శబ్దాలు వినిపించాయి. చుట్టు పక్కల ఇళ్లు, వాపార సముదాయా ల్లో ఉన్న గాజు సామాన్లు, అద్దాలు పగిలిపోయాయి. ఇళ్లు దెబ్బ తిన్నాయి. ఆ పేలుడు శబ్దాలకు ప్రజలు ఉలిక్కిపడ్డారు. దట్టమైన పొగతో పాటు భారీ ఎ ం ట లు వ్యాపించడంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటి ఎస్పీ నాగిరెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు కూడా సహాయక చర్యల్లో నిమగ్నమై మంటల్లో ఉన్న బాధితులను కాపాడే ప్రయత్నం చేశారు. ఈ దుర్ఘటనలో సూరజ్ భార్య కుమార్తె, ఇద్దరు కోడళ్లతోపాటు అక్కడ పనిచేసే వారితో సహా 8 మంది దుర్మరణం చెందారు. 20మంది తీవ్రంగా గాయపడగా.. వారిని శ్రీకాకుళంలోని ప్రభుత్వ ఆస్పత్రికి (మిగతా 8వ పేజీలో..)

2005లో.. నువ్వలరేవులో..

- బాణసంచా విస్ఫోటనం
- పది మంది మృతి, 26 మందికి గాయాలు

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవులో 2005 ఏప్రిల్ 19న జరిగిన బాణసంచా విస్ఫోటనంలో పది మంది మృతి చెందారు. 26మంది గాయపడ్డారు. బాధితులలో అధికమంది చిన్నారులే. ఈ గ్రామంలో ఏటా శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు రావణుడి బొమ్మను బాణసంచా సామగ్రితో దహనం చేసేవారు. ఈ ఉత్సవాలను చూసేందుకు అధిక సంఖ్యలో ప్రజలు తరలి వచ్చేవారు. ఒడిశా నుంచి బాణసంచా సామగ్రి తయారు చేసేవారిని తెప్పించేవారు. కాగా.. నాడు పాఠశాల భవనంలో బాణసంచా తయారీ చేస్తుండగా పేలుడు సంభవించి ప్రమాదం చోటు చేసుకుంది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు ఆర్థిక సహాయం చేస్తామని ప్రకటించినా ఇప్పటివరకు పరిహారం అందలేదని బాధితులు తెలిపారు. అప్పటి నుంచీ శ్రీరామ నవమి ఉత్సవాల్లో బాణసంచా వినియోగం నిషేధించామని గ్రామస్థులు వివరించారు. ఈ ఘటనతో దీపావళి నాడు బాణసంచా సామగ్రి వినియోగించుకునేందుకు గ్రామస్థులు భయపడుతుంటారు.



శ్రీకాకుళంలో నాడు పేలుడు సంభవించిన ప్రాంతమిదే

విద్యుత్ బిల్లుల షాక్!



- సర్దుబాటు చార్జీల పేరిట అదనపు వసూళ్లు
- జిల్లా వినియోగదారులపై రూ.3 కోట్ల భారం
- జగన్ సర్కారు తీరే కారణమంటున్న కూటమి ప్రభుత్వం

ఇచ్ఛాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు విద్యుత్ షాక్ తగలనుంది. నవంబరు నుంచి విద్యుత్ చార్జీలు పెరగనున్నాయి. 15 నెలలుపాటు ఈ బాదుడు కొనసాగనుంది. విద్యుత్ చార్జీలు పెంచకూడదని కూటమి ప్రభుత్వం భావించినా.. గత వైసీపీ సర్కారు నిర్వాకం పుణ్యమా అని పెంచక తప్పని పరిస్థితి డిస్కంలది. జగన్ ప్రభుత్వ వైఫల్యాలు ఆయన గద్దె దిగినా వెంటాడుతూనే ఉన్నాయి. ఇప్పటికే విద్యుత్ వినియోగదారులు సర్దుబాటు చార్జీలతో సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి మరో రూ.6,072.86 కోట్లు వసూలు చేసేందుకు డిస్కంలకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ఇటీవల అనుమతులిచ్చింది. దీంతో వినియోగదారుల నుంచి ఈ బిల్లులు వసూలు చేసేందుకు విద్యుత్ శాఖ సిద్ధపడుతోంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అదనపు సర్దుబాటు చార్జీలను 15 నెలల పాటు వసూలు చేసే పరిస్థితి కనిపిస్తోంది. అదే జరిగితే 2026 జనవరి వరకూ విద్యుత్ చార్జీలతో పాటు అదనపు బాదుడు తప్పదు. దీంతో వినియోగారులు ఆందోళన చెందుతున్నారు.

● ఇదీ పరిస్థితి..

జిల్లాలో విద్యుత్ శాఖకు సంబంధించి శ్రీకాకుళం, టెక్కలి, పలాస డివిజన్లు కొనసాగుతున్నాయి. వీటి పరిధిలో 7,88,078 విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. గత ఐదేళ్లలో (మిగతా 8వ పేజీలో..)



శ్రీకాకుళం ఏపీ ఈపీడీసీఎల్ కార్యాలయం



పున్నానపాలెం గ్రామం

పున్నానపాలెం.. దీపావళికి దూరం



మూఢనమ్మకాల ముసుగు తొలగేదెప్పుడు

మూఢనమ్మకాల ముసుగు తొలగించేందుకు అధికారులతో పలుమార్లు దీపావళి పండగపై అవగహన కల్పించే ప్రయత్నం చేశాను. గ్రామ పెద్దలు దీనిని ప్రతిఘటించారు. విధిలేని పరిస్థితిలో ఈ రెండు పండగలకు దూరమయ్యాం.

- పున్నాన నరసింహుల నాయుడు, విశ్రాంతి ఉపాధ్యాయుడు, పున్నానపాలెం

- పూర్వీకుల నుంచీ కొనసాగుతున్న ఆచారం

రణస్థలం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): దీపావళి.. చిన్నారుల నుంచి పెద్దల వరకూ సరదాగా చేసుకునే పండగ. దీపావళి నాడు ఓ వైపు దీపాల వెలుగులు.. మరోవైపు బాణసంచాల పేలుళ్లతో ఏ ఊరు చూసినా సందడే సందడి. కాగా.. రణస్థలం మండలం సంచాం పంచాయతీ పున్నానపాలెం గ్రామం మాత్రం.. దీపావళి వేడుకులకు దూరం. తాత ముత్తాతల నుంచి ఈ సంప్రదాయం ఉండగా.. నేటి తరం కూడా ఆ ఆచారాన్ని కొనసాగిస్తూ.. దీపావళి సంబరాలు చేసుకోకపోవడం గమనార్హం. ఇంతకీ వారు దీపావళి వేడుకలకు ఎందుకు దూరంగా ఉన్నారో.. తెలుసుకుందాం.

పున్నానపాలెంలో సుమారు రెండువేలకు పైగా జనాభా ఉన్నారు. అధిక కుటుంబాల ఇంటి పేరు పున్నాన. ఈ గ్రామంలో ప్రధానంగా కాపు, యాదవ సామాజిక వర్గాలు ఉన్నాయి. గ్రామస్థుల్లో 95శాతం మందికిపైగా.. తాత ముత్తాతల నుంచీ దీపావళి, నాగులచవితి పండగలు చేసుకోవడం లేదు. తొలుత వ్యవసాయం చేయడానికి కాపు కులానికి చెందిన రైతు, అలాగే గొర్రెల కాపరిగా యాదవ కులానికి చెందిన ఒక వ్యక్తి వచ్చి ఈ గ్రామానికి వచ్చి స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారని కథనం. అనంతరం ఈ రెండు కులాలు సమాంతరంగా అభివృద్ధి చెందుతూ నేడు 155 కుటుంబాలు ఏర్పడ్డాయి. సుమారు 150ఏళ్ల కిందట ఈ గ్రామంలోని ఒక రైతు దీపావళి, నాగులచవితి పండగ చేసిన తర్వాత కొన్ని కష్టనష్టాలు కలగడంతో ఈ రెండు (మిగతా 8వ పేజీలో..)

పెద్దల మాట జవదాటం



దీపావళి పండగ చేస్తే కష్టాలు కలుగుతున్నాయి కావున పెద్దల మాట జవదాటం. మా కన్నవారి ఇంటి వద్ద దీపావళి పండగ ఘనంగా చేసుకున్నప్పటికీ.. నేడు ఈ గ్రామానికి కోడలిగా వచ్చినందున వేడుకలకు దూరమయ్యాను.

- పున్నాన సత్యం, పున్నాలపాలెం

ఇంటి పేరు మారినందున..



వివాహం అనంతరం పున్నాన ఇంటి పేరు నుంచి మండల అత్తవారింటి పేరుగా మారడంతో దీపావళి పండగ చేసుకుంటున్నాం. దీపావళి వేడుకల చేసుకోవాలని ఎంతో ఆసక్తి ఉన్నా.. మా గ్రామానికి చెందిన యువత.. పెద్దల మాటను గౌరవించి పండగకు దూరంగా ఉంటారు.

- మండల అరుణ, పున్నానపాలెం

పూర్వీకుల నుంచీ..



మా కన్నవారింటి దీపావళి, నాగులచవితి చేసుకున్నప్పటికీ.. మా అత్తవారింట కుటుంబ సభ్యులు ఈ పండగలు చేయడం లేదు. పూర్వీకుల నుంచీ ఈ ఆచారం కొనసాగుతోంది.

- పున్నాన అప్పలనరసమ్మ, పున్నానపాలెం

న్యూస్ బాక్స్

మహిళల్లో అక్షరాస్యత పెంచేందుకు 'ఉల్లాస్'

- జడ్పీ సీఈవో శ్రీధరరాజు



శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో అక్షరాస్యతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఉల్లాస్ కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని జడ్పీ సీఈవో శ్రీధరరాజు తెలిపారు. మంగళవారం స్థానిక డీఆర్డీఏ కార్యాలయంలో.. జిల్లాస్థాయి ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వయోజన విద్యపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. వయోజన విద్య ఏడీ వెంకటరమణ మాట్లాడుతూ అక్షరాస్యతలో జిల్లాను ముందంజలో నిలిపేందుకు ఉల్లాస్ దోహదపడుతుందన్నారు. 'ఈ శిక్షణకు పొదుపు సంఘాల్లో మహిళలు, ఆయాలు, పాఠశాలల్లో పనిచేసే సహాయకులు, అంగన్‌వాడీ సహాయకుల్లో నిరక్షరాస్యులను ఇప్పటికే గుర్తించాం. వీరికి నిర్ణీత షెడ్యూలు ప్రకారం ప్రతీ రోజు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. ఫంక్షనల్, డిజిటల్, ఆర్థిక అక్షరాస్యతపై అభ్యసన ఉంటుంది. డీఆర్డీఏ, ఐసీడీఎస్, డీపీవో, గ్రామ/వార్డు సచివాలయం, డీఐపీఆర్వో, విద్యాశాఖ అధికారుల సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తామ'ని ఏడీ తెలిపారు. కార్యక్రమంలో సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, పర్యాటకశాఖ అధికారి నారాయణరావు, ఎంపీడీవోలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

పొదుపు సరే.. మదుపు చేస్తేనే..

- విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలి
- నేడు ప్రపంచ పొదుపు దినోత్సవం

8 లో

ఎచ్చెర్ల/నరసన్నపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): 30-40 ఏళ్ల క్రితం పొదుపు చేసిన డబ్బు పోపు డబ్బాల్లో, బీరువాల్లో దాచుకునేవారు. ఇం కొందరు బ్యాంకులో డిపాజిట్ చేసేవారు. ఆదాయం ఎక్కువగా ఉండేవారు అయితే భూములు, స్థలాలు కొనుగోలు చేసేవారు. గడచిన 10-15 ఏళ్లుగా దేశీయ స్టాక్‌మార్కెట్ పై దృష్టి మళ్లినా 2020 వరకు వీరి సంఖ్య తక్కువే. అయితే కొవిడ్ తర్వాత పరిస్థితి మారిపోయింది. చాలామంది స్టాక్‌మార్కెట్‌పై దృష్టి పెట్టారు. క్రమం తప్పకుండా పెట్టుబడులు పెడుతున్నారు. బ్యాంక్‌లో వడ్డీ 5-6శాతానికి మించక పోవడం.. రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టినా లిక్విడిటీ లేకపోవడం వల్ల ఇతర మదుపుచేసే మార్గాలపై అవగాహన పెంచుకున్నారు. కొవిడ్ సమయంలోనే ఇదంతా ఎక్కువగా జరిగింది. అప్పటి వరకు స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడి పెట్టేవారి సంఖ్య కేవలం 4 శాతమే ఉండగా.. ఇప్పుడు అది 14 శాతానికి పెరగడం గమనార్హం. దీనికితోడు సోషల్ మీడియా కూడా విస్తృత ప్రచారం చేస్తుండడంతో మదుపరులు అటువైపు దృష్టి సారిస్తున్నారు. అయితే ట్రేడింగ్ కన్నా.. దీర్ఘకాలిక పెట్టుబడులు అయితేనే లాభాలు ఆర్జించవచ్చని నిపుణులు చెబుతున్నారు.



జిల్లా ఓటర్లు: 18,77,426

- మహిళలే అధికం
- నూతన ముసాయిదా జాబితా విడుదల
- నవంబరు 28వరకు సవరణలకు అవకాశం
- జనవరి 6న తుది జాబితా
- జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు



శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 18,77,426 మంది ఓటర్లు ఉన్నారని, పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితా-2025 ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో మంగళవారం ముసాయిదా జాబితా విడుదల చేశామని తెలిపారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే నవంబరు 28లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 'నూతన ఓటర్ల జాబితా తయారీలో భాగంగా ఈ ఏడాది ఆగస్టు 20 నుంచి అక్టోబరు 18వరకు బీఎల్వోలు ఇంటింటా సర్వే నిర్వహించాం. మృతులు, వలస ఓటర్ల తొలగింపుతో పాటు, 2025 జనవరి ఒకటో తేదీ నాటికి అర్హులైన వారి నుంచి కొత్తగా ఫారం-6 దరఖాస్తులు స్వీకరించాం. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో నవంబరు 9, 10, 23, 24న ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఓటర్ల మార్పులు, చేర్పులు, తొలగింపులు, సవరణల నిమిత్తం దరఖాస్తులు స్వీకరిస్తాం. డిసెంబరు 24 వరకు వచ్చిన వాటిపై విచారించి అర్హులైన వారికి ఓటు హక్కు కల్పిస్తాం, జనవరి 6న తుది జాబితా వెల్లడిస్తామ'ని డీఆర్వో తెలిపారు.

● సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ ఏడాది మే 13న పోలింగ్ జరిగింది. అప్పటికి జిల్లాలో మొత్తం 18,59,910 మంది(పురుషులు 9,22,442 మంది, (మిగతా 6వ పేజీలో..)



ఈదుపురంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ముఖ్యమంత్రి సభకు ముమ్మర ఏర్పాట్లు

ఇచ్ఛాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నవంబరు 1న ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామంలో పర్యటించనున్నారు. దీని కోసం అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. సభా ప్రాంగణాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం పరిశీలించారు. సంబంధిత అధికారులతో చర్చించారు. సభా ఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

భావనపాడులో హార్బర్ ఏర్పాటుకు సన్నాహాలు

- తీరప్రాంతాన్ని పరిశీలించిన కేంద్ర బృందం

సంతబొమ్మాళి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలం భావనపాడులో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం తీరప్రాంతాన్ని.. బెంగళూరుకు చెందిన కేంద్ర ప్రభుత్వ తీరప్రాంత ఇంజనీర్ వ్యవస్థ(సీఐసీఈఎఫ్) డిప్యూటీ డైరెక్టర్ ఎం.బి.బెలియప్ప మంగళవారం సందర్శించారు. మత్స్యకారుల బోటులో ప్రయాణించి ఫిషింగ్ హార్బర్ ప్రతిపాదిత స్థలాన్ని, సముద్ర ముఖద్వారం వద్ద మేటలు వేసిన ఇసుక దిబ్బలను, ముఖద్వారానికి ఇరువైపులా ఉన్న క్రిక్‌వాల్‌ను పరిశీలించారు. మత్స్యకారులతో మాట్లాడారు. సముద్రముఖ ద్వారం వద్ద ఇసుక మేటలు వేయడం వల్ల వేట నిషేధిత కాలం నుంచి వేట సాగక ఇబ్బంది పడుతున్నామని మత్స్యకారులు తెలిపారు. వేట సాగక కొంతమంది వలసబాట పట్టారని.. ఇసుక మేటలు తొలిగించి సమస్య పరిష్కరించాలని కోరారు. శాశ్వతంగా జీవనోపాధి దొరికేలా ఫిషింగ్ హార్బర్ వేగవంతంగా నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా.. 'వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భావనపాడులో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ మేరకు బెంగళూరులోని సీఐసీఈఎఫ్ సంస్థ సభ్యులు తీరప్రాంత పరిశీలనకు వచ్చారు' అని జిల్లా మత్స్యశాఖ జేడీ పీవీ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ సత్యనారాయణ, టెక్కలి ఎఫ్‌డీవో ధర్మరాజు పాత్రో, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు గొరకల ఆదినారాయణ పాల్గొన్నారు.



తీరప్రాంతాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

పొదుపు సరే.. మదుపు చేస్తేనే..

- విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలి
- తల్లిదండ్రులు ఆ దిశగా ప్రోత్సహించాలి
- మార్కెట్‌లో మదుపుచేసే మార్గాలెన్నో..
- నిపుణుల సలహా తీసుకోవడం మంచిది
- నేడు ప్రపంచ పొదుపు దినోత్సవం



ఎచ్చెర్ల/ నరసన్నపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పొదుపు చేయండంటూ చాలామంది ప్రోత్సహిస్తుంటారు. కానీ పొదుపు చేయడంతోనే ఆర్థికాభివృద్ధి సాధించలేం. దాన్ని సరైన మార్గంలో మదుపు చేసినప్పుడు భవిష్యత్తు బంగారుమయం ఉంటుంది. అది మనకు, మన పిల్లలకు ఆర్థిక భరోసానిస్తుంది. ఆ తర్వాతి తరాలకూ ఎంతో ఉపయోగ పడుతుంది. అయితే చాలామందికి పొదుపు చేయడం మాత్రమే తెలుసు. దాన్ని వృద్ధి చేసుకోవడానికి ఉన్న మార్గాలు మాత్రం 90 శాతం మందికి తెలియవు. కొందరు బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తుంటారు. దీనివల్ల ద్రవ్యోల్బణాన్ని అధిగమించలేము. ఇంకొందరు బయట తెలిసిన వారికి, బంధువులకు వడ్డీకి ఇస్తుంటారు. అలాంటి డబ్బులు తిరిగి వస్తాయన్న గ్యారంటీ మాత్రం ఉండదు. ఇలాంటి వారిని తప్పుపట్టలేం. వారికి మదుపుచేసే ఇతర మార్గాలు తెలియక పోవడం, తెలిసినా వాటిపై అపోహ కలిగి ఉండడం వల్ల అటువైపు వెళ్లలేక పోతున్నారు. విద్యార్థి దశ నుంచే పొదుపు చేసే ప్రక్రియ తల్లిదండ్రులు నేర్పించాలి. పిల్లలకు కిడ్డీ బ్యాంకులను, మట్టితో తయారుచేసే హుండీ (పిడతల)లను ఇవ్వాలి. దాన్ని ఇతర మదుపు సాధనాలలో పెట్టాలు. అది పెరుగుతున్నప్పుడు పిల్లలకు అవగాహన కల్పించాలి. అంతేకాకుండా పొదుపు అనేది డబ్బులు విషయంలోనే కాదు.. నీరు, విద్యుత్ వినియోగంలో కూడా పాటించాలి. తద్వారా సమాజానికి సేవ చేసినవారమవుతాం. ఇటీవల దేశీయ స్టాక్‌మార్కెట్ వైపు మొగ్గుచూపే వారే సంఖ్య పెరుగుతోంది. డీ మ్యాట్ అకౌంట్ల సంఖ్య ఇప్పుడు 14 కోట్లకు చేరుకోవడమే ఇందుకు ఉదాహరణ. మ్యూచువల్ ఫండ్స్‌లో సిప్ పద్ధతిలో దీర్ఘకాలం పాటు మదుపు చేస్తే ఆర్థిక ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. నిఫ్టీ ఇండెక్స్, బీఎస్‌ఈలో ఇన్వెస్ట్ చేస్తే సరాసరి రాబడి 11-12 శాతం దాకా ఉంటుందంటున్నారు. దీనివల్ల ద్రవ్యోల్బణాన్ని అధిగమించవచ్చని సూచిస్తున్నారు. నిపుణుల సలహాలు తీసుకుని ముందుకు సాగాలని వారు అంటున్నారు. విజయవాడ, హైదరాబాదు, బెంగళూరులో చాలామంది జిల్లా వాసులు సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్ రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. వీరికి అవగాహన ఉండడం వల్ల దీర్ఘకాలిక పెట్టుబడులను పెడుతున్నారు. గతంలో ఇన్వెస్ట్‌మెంట్ అంటే భూములు, స్థలాలు కొనడమే. అయతే కరోనా తర్వాత చాలామంది మదుపరులు రియల్ ఎస్టేట్ నుంచి స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నారు. అప్పట్లో శ్రీకాకుళం, నరసన్నపేట, ఆమదాలవలస, పలాస, సోంపేట పట్టణాల్లో వందల సంఖ్యలో మదుపరులు ఉండేవారు. ఇప్పుడు స్టాక్ మార్కెట్ దూసుకుపోవడం.. మార్కెట్లపై అవగాహన కల్పిస్తుండడం వల్ల సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ పద్ధతిలో పెట్టుబడులు పెడుతున్నారు. అనుభవం, అవగాహన ఉన్న వారు నేరుగా కంపెనీల షేర్లు కొంటుండగా.. ఇంకొందరు మ్యూచువల్ ఫండ్స్‌లో సిప్ చేస్తున్నారు.



పొదుపునకు ఓ ఫార్ములా ఉంది

ప్రతి ఒక్కరూ తన ఆదాయంలో 20 శాతం పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. దీనినే 50--30-20 ఫార్ములా అంటారు. ఆదాయంలో 50 శాతం ఇంటి అవసరాలు, ఆహారం, దుస్తులు, మందులకు వినియోగించాలి. 30 శాతం వినోదానికి, ఇతర అవసరాలకు కేటాయించాలి. మిగిలిన 20 శాతాన్ని పొదుపు, పెట్టుబడులకు వినియోగించాలి.



అవగాహనతో మదుపు చేయాలి

దేశీయ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే రిస్క్‌తో పాటు రివార్డు ఉంటుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అయితే సిప్ పద్ధతిలో 10-20-30 ఏళ్లపాటు పెట్టుబడులు పెడితే ఆర్థిక స్వావలంబన సాధించవచ్చంటున్నారు. కొందరు నిపుణుల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

మార్కెట్‌లో తీరుతెన్నులను పరిశీలించాలి



మార్కెట్‌లో స్థిరత్వం అనేది లేదు. మార్కెట్‌లో పరిస్థితులు, సమకాలీన అంశాలను తెలుసుకుని స్టాక్, బంగారం, భూములపై పెట్టుబడులు పెట్టాలి. వస్తువుల ధరలు పెరిగే వాటిపై పెట్టుబడులు పెట్టడం అంత మంచిది కాదు. మార్కెట్‌లో ఒడుదుడుకులు వస్తాయి. వాటిని తట్టుకునే సంస్థల షేర్‌లు కొనుగోలు చేయడం మంచిది.

- ప్రొ. పి.అన్నాజీరావు, అర్థశాస్త్ర అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల నరసన్నపేట

మహిళలో చైతన్యం అవసరం



మహిళల్లో పొదుపుపై మరింత చైతన్యం ఎంతో అవసరం. ఇన్వెస్ట్‌మెంట్‌పై అవగాహన కల్పించాలి. ఉద్యోగులు అయితే పెట్టుబడులు పెట్టడం ద్వారా ఏవిధంగా లాభాలను ఆర్జించవచ్చుననే విషయాన్ని అవగాహన చేసుకోవాలి. చిన్న మొత్తం పొదుపు అయినా చాలా మంచిదే. ప్రభుత్వాలు వడ్డీ రేట్లు పెంచితే బాగుంటుంది.

- ఎంఆర్ జ్యోతి ఫ్రెడరిక్, రిటైర్డు ప్రిన్సిపాల్, వాణిజ్య, గణాంకశాస్త్రనిపుణులు

సరైన రీతిలో పొదుపు చేయాలి



పొదుపును పాటించడం చాలా మంచిది. ప్రతి రూపాయి విలువైనదే. అత్యవసరాల్లో, పిల్లల చదువుకు పొదుపు చేసిన మొత్తం వినియోగించుకునేందుకు వీలుంటుంది. పొదుపు చేసిన మొత్తం మదుపు చేసేందుకు వివిధ మార్గాలు ఉన్నాయి. వాటిలో ఏవి సరైనవో తెలుసుకోకుండా ముందుకు సాగితే ఇబ్బందులు తప్పవు. గుర్తింపు పొందిన సంస్థల్లో, బ్యాంకుల్లో డబ్బు దాచుకుంటే ఎలాంటి నష్టం కలుగదు. డబ్బు దాచుకోవాలన్నా, అప్పు తీసుకోవాలన్నా సరైన పద్ధతులు పాటించాలి.

- ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రెక్టార్, ఎకనామిక్స్ విభాగాధిపతి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ

అవగాహన లేకుంటే ఇబ్బందే



పొదుపు చేసే మొత్తాన్ని సరైన పద్ధతిలో మూడు భాగాలుగా విభజించాలి. మొదటి భాగం రిస్క్ ఉన్న జాతీయ పొదుపు మార్గాలైన రికరింగ్ డిపాజిట్ (ఆర్డీ), పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్), నేషనల్ ఫెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్) మరియు పోస్టాఫీసుల్లో, బ్యాంకుల్లో అందుబాటులో ఉండే వివిధ ప్రభుత్వ పొదుపు పథకాల ద్వారా పొదుపు చేయాలి. ఈ పొదుపునకు ఆదాయ పన్ను మినహాయింపు కూడా ఉంటుంది. రెండో భాగంలో మధ్యంతర రిస్క్ ఉండే యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్స్ (యూఎల్‌పీ) మ్యూచువల్ ఫండ్స్‌లో మదుపు చేయవచ్చు. ఇలా చేసేటప్పుడు సరైన అవగాహన కలిగి ఉండాలి. డిజిటల్ పేమెంట్స్ అయిన ఫోన్ పే, పేటీఎం, బ్యాంకుల ద్వారా పెట్టుబడి పెట్టవచ్చు. మూడో విధానంలో అధిక రిస్క్ అలాగే ఆదాయానికి అవకాశం ఉన్న స్టాక్ మార్కెట్‌లో డీమ్యాట్ అకౌంట్ ద్వారా పెట్టుబడులు కొనసాగించవచ్చు. నిరంతరం ఈ స్టాక్స్ గురించి, ఆ రంగాల గురించి సమాచారాన్ని తెలుసుకోవాలి.

- డాక్టర్ ఎన్.సంతోష్ రంగనాథ్, కామర్స్, మేనేజ్‌మెంటు కోర్సు విభాగాధిపతి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ

బాణసంచా విక్రయాల్లో నిబంధనలు పాటించాల్సిందే

- జిల్లాలో 90 దుకాణాలకు అనుమతులు
- డీఎఫ్‌వో మోహన్‌రావు



విలేఖరులతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో మోహన్‌రావు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బాణసంచా విక్రయాల్లో వ్యాపారులు నిబంధనలు పాటించాల్సిందేనని జిల్లా అగ్నిమాపకాధికారి (డీఎఫ్‌వో) జె.మోహన్‌రావు స్పష్టం చేశారు. మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయాలకు గాను జిల్లా వ్యాప్తంగా 98 దరఖాస్తులు రాగా అందులో 90 షాపులకు అనుమతులు మంజూరు చేశామన్నారు. ఇచ్ఛాపురంలో 1, సోంపేట 3, పలాస 19, టెక్కలి 10, కోటబొమ్మాళి 4, నరసన్నపేట 7, ఆమదాలవలస 3, రణస్థలం 9, శ్రీకాకుళం నగరం(ఆర్ట్స్ కళాశాల) 21, ఫాజుల్‌బాగ్ పేటలో-1, కొత్తూరు-1, శ్రీకాకుళం రూరల్‌లో 11 షాపుల్లో బాణ సంచా విక్రయాలకు అనుమతులు ఇచ్చామన్నారు. దుకాణాల మధ్య మూడు మీటర్ల దూరం పాటించాలని, మంచి నీళ్ల బకెట్లు, డ్రమ్ములు ఏర్పాటు చేయాలని సూచించారు. నిబంధనలు పాటించకపోతే షాపు యాజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల పాటు బాణసంచా విక్రయాలకు అనుమతులు ఇచ్చారు. దీంతో మంగళవారం నుంచే అమ్మకాలు మొదలయ్యాయి. అయితే, శ్రీకాకుళం నగరంలో మాత్రం గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని రెండు రోజులకే అనుమతులు ఇచ్చారు. ఆర్ట్స్ కళాశాలల్లోని దుకాణాల్లో బుధవారం నుంచి విక్రయాలు జరగనున్నాయి.

బతుకు పోరాటంలో..



చెరువులో కలువ పూలను తీస్తున్న యువకులు

పలాస రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బతుకు పోరాటంలో అనేక మజిలీలు చేస్తుంటాం. జీవనానికి అనేక మార్గాలు ఎంచుకుని ఎంత కష్టమైనా జీవన పోరాటం దిశలో పాటుపడుతుంటాం.. ఈ చిత్రం చూసినా అటువంటిదే జ్ఞాపకం వస్తుంది. చెరువులో కలువ పూలను తీసి విక్రయించే వచ్చే ఆ మొత్తంతో జీవనం సాగించే దిశలో ఇద్దరు యువకులు సాహసంగా లోపలకు వెళ్లారు. లోతుగా ఉన్న ప్రాంతంలోకి పెద్ద లారీ ఇన్నర్ల సాయంతో వెళ్లి కలువ పూలను తీయడం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది. దీపావళి పర్వదినం సందర్భంగా కలువ పూలను విక్రయించేందుకు వీరు ఇలా సాహసం చేస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వంలో వేధింపులు, బెదిరింపులు

- అందుకే క్వారీలు మూసేసుకోవాల్సి వచ్చింది
- గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర ఎదుట క్వారీ యజమానుల ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

విశాఖపట్నం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో పాలకులు, వారి వందిమాగధుల వేధింపులు, బెదిరింపులతో క్వారీలు మూసేసుకోవాల్సి వచ్చిందని, దాంతో కొంతమంది అప్పుల పాలవ్వడం జరిగిందని క్వారీ యజమానులు ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం జడ్పీ హాలులో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన క్వారీ, క్రషర్స్ గ్రానైట్ క్వారీ యజమానులు, అధికారులతో గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఎదుర్కొన్న ఇబ్బందులను నిర్భయంగా చెప్పాలని సూచించినప్పుడు పలువురు క్వారీ యజమానులు అనుభవాలను ఏకరువు పెట్టారు. అనకాపల్లి ప్రాంతంలో క్వారీలు నిర్వహించే వెంగమాంబ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనిఖీల పేరిట విపరీతంగా వేధింపులకు పాల్పడడమే కాకుండా బెదిరించారని ఫిర్యాదు చేశారు. కొందరు అధికారులు బరితెగించి ప్రవర్తించడంతో వ్యాపారం నిలిపివేశానన్నారు. ఇంకా ఈసీ అనుమతుల విషయంలో ఇబ్బందులున్నాయని చెప్పడంతో మంత్రి స్పందిస్తూ త్వరలో సంబంధిత శాఖలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. పరవాడ మాజీ జడ్పీటీసీ సభ్యుడు మాధంశెట్టి నీలబాబు మాట్లాడుతూ.. రాజకీయంగా వేధించారని, జీవీఎంసీ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకోవాలని బెదిరించారన్నారు. వినకపోవడంతో క్వారీని నిలుపుదల చేశారన్నారు. విజయనగరం జిల్లాకు చెందిన నాగరాజు మాట్లాడుతూ.. భీమిలి మండలం దాకమర్రిలో కొంతమందితో కలిసి నిర్వహిస్తున్న క్వారీని తనిఖీ చేసి రూ.ఎనిమిది కోట్లు జరిమానా విధించారన్నారు. తామంతా టీడీపీ సానుభూతిపరులం కావడంతో వేధించారని వాపోయారు. క్వారీ యజమానుల సమస్యలు విన్న మంత్రి బదులిస్తూ గత పాలకులు గనుల శాఖను సొంతానికి వాడుకున్నారని ఆరోపించారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ.. క్వారీ యజమానులు నిజాయితీగా వ్యవహరించాలని, గత ప్రభుత్వంలో ఏర్పడిన ఇబ్బందులు కూటమి ప్రభుత్వం తొలగిస్తుందన్నారు. పెందుర్తి, విశాఖ దక్షిణ ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ నేత దాడి రత్నాకర్ మాట్లాడారు.

విద్యుత్ బిల్లు.. రూ.11,425



విద్యుత్ బిల్లుతో బాధితుడు కామేశ్వరరావు

టెక్కలి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలోని మండాపొలం కాలనీలో నివాసం ఉంటున్న బి.కామేశ్వరరావు అనే వ్యక్తి ఇంటికి విద్యుత్ బిల్లు షాక్ ఇచ్చింది. రోజు కూలీగా ఉన్న కామేశ్వరరావు ఇంటికి రూ.11,425 విద్యుత్ బిల్లు రావడంతో బాధితుడు లబోదిబోమంటున్నాడు. విద్యుత్ బిల్లు సవరించాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని బాధితుడు వాపోతున్నాడు. విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జిల్లా ఓటర్లు: 18,77,426

(ఏడో పేజీ తరువాయి)

స్త్రీలు 9,37,329, ఇతరులు 139 మంది) ఓటర్లు ఉన్నారు. తాజాగా ప్రకటించిన ముసాయిదా ప్రకారం ఆ సంఖ్య 18,77,426కి చేరింది. ఇందులో 16,240 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. పురుషులు 9,30,479 కాగా, మహిళలు 9,46,817 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 16,338మంది అధికంగా ఉన్నారు. వీరు కాకుండా ఇతరులు 130 మంది ఉన్నారు. మొత్తంగా 17,516 మంది ఓటర్లు పెరిగారు. ప్రస్తుతం ఉన్న 2,358 పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి మార్పు లేదని డీఆర్వో వివరించారు.

చురుగ్గా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం చురుగ్గా సాగుతుందని, ముసాయిదా జాబితా నవంబరు 23న విడుదల చేస్తామని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు డిసెంబరు 8 చివరి తేదీ అని అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు ఓటర్లుగా నమోదు కావాలని కోరారు. సమావేశంలో సి-సెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల షాక్!

(ఏడో పేజీ తరువాయి)

వైసీపీ సర్కారు విద్యుత్ చార్జీలను చాలాసార్లు పెంచింది. దీనికితోడు ట్రూఅప్ చార్జీల పేరిట వినియోగదారులపై భారం మోపింది. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.100 నుంచి రూ.150 వరకూ సామాన్య కుటుంబానికి విద్యుత్ చార్జీలు ఉండేవి. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అవి రెట్టింపయ్యాయి. 100 నుంచి 150 శాతానికి పెరిగాయి. ఆ బిల్లు కట్టేందుకే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మళ్లీ ఇప్పుడు అదనపు చార్జీల పేరిట వసూళ్లకు సన్నద్ధమవుతుండడంతో పేద, మధ్య తరగతి ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అప్పట్లో నిర్లక్ష్యం

వైసీపీ హయాంలో విద్యుత్ వినియోగం, ఇతరత్రా అంశాలపై డిస్కంలు ప్రతిపాదించినా అప్పట్లో ప్రభుత్వం నుంచి స్పందన లేకుండా పోయింది. దీంతో అప్పటి సర్దుబాటు చార్జీలను ఇప్పుడు వసూలు చేయాల్సి వస్తోందని కూటమి ప్రభుత్వం చెబుతోంది. సర్‌చార్జీల రూపంలో యూనిట్ ధర రూ.1.50 పైసలు పెరిగే అవకాశముంది. 30 యూనిట్లలోపు వినియోగిస్తే యూనిట్‌కు రూ.1.90 వసూలు చేస్తున్నారు. తాజాగా ఈ సర్దుబాటు చార్జీలతో అది రూ.3.20కు పెరగనుంది. అలాగే 400యూనిట్ల వరకూ ఖర్చుచేసే వినియోగదారుడికి ఇప్పటివరకూ యూనిట్‌కు రూ.9.75 వసూలు చేస్తుండగా.. ఇక నుంచి రూ.12.30 పైసల వరకూ పెరగనుంది. జిల్లాలో వినియోగదారులపై రూ.3కోట్ల భారం పడనుందని విద్యుత్ శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సెప్టెంబరు నెలకు సంబంధించి విద్యుత్‌చార్జీల రూపంలో అన్ని రకాల వినియోగదారుల నుంచి రూ.97.16 అదనంగా వసూలు చేశారు. కానీ ఇప్పుడు సర్దుబాటు చార్జీల రూపంలో మోత మోగడంతో రూ.101 కోట్లు వరకూ వసూలు చేసే అవకాశం ఉంది.

ఆ పేలుడు ఘటనకు 20 ఏళ్లు

(ఏడో పేజీ తరువాయి)

తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరో ముగ్గురు మృతి చెందారు. భారీ పేలుడు కారణంగా.. దూరంగా ఉన్న ఓ పసిపాప సైతం మృతి చెందింది.

కానిస్టేబుల్ సైతం మృతి..

ఓ వైపు మంటలు అదుపు చేస్తున్నా.. బాణసంచా సామగ్రి పేలుతుండడంతో ప్రజలు భయాందోళన చెందారు. బాణసంచా సామగ్రి వ్యర్థాలను ఓ లారీలో వేసి.. ఆర్ట్స్ కళాశాల వెనుక ఉన్న శాంతినగర్ కాలనీలో నది సమీపంలో డంపింగ్ చేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. కాగా.. డంపింగ్ సమయంలో మరోసారి పేలుడు సంభవించింది. దీంతో అక్కడ విధుల్లో ఉన్న గార స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు సుందరరావు, రామచంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి శ్రీకాకుళం సీఐ కృష్ణమూర్తి నాయుడు, వన్‌టౌన్ ఎస్‌ఐ ఎం.అప్పారావు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన కానిస్టేబుళ్లను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుందరరావు మృతి చెందారు. ఇలా 20 ఏళ్ల కిందట జరిగిన దుర్ఘటన పలు కుటుంబాల్లో విషాదం మిగిల్చింది.

పున్నానపాలెం.. దీపావళికి దూరం

(ఏడో పేజీ తరువాయి)

పండగలను బహిష్కరించారని స్థానికుల కథనం. 'ఆ రైతు నాగులచవితి నాడు పుట్టలో నాగేంద్రుడికి పూజించిన తర్వాత ఇంటికి వచ్చేసరికి ఉయ్యాల్లో ఉన్న బిడ్డను నాగుపాము పొడవడంతో బాలుడు చనిపోయాడు. వ్యవసాయం చేసే రెండు ఎద్దులు కూడా మృతి చెందాయి' అని.. నాటి నుంచీ ఈ రెండు పండగలను బహిష్కరిస్తున్నామని గ్రామస్థులు తెలిపారు. చిన్నపిల్లలు సైతం ఏ విధమైన టాపాసులు పేల్చకుండా ఉండడం విశేషం. ఈ గ్రామంలో ఉన్నవారందరిదీ నాగుల గోత్రం అయినా నాగుల చవితి చేయకపోవడం గమనార్హం. పున్నాన ఇంటిపేరు గల కుటుంబాలకు కోడళ్లుగా వచ్చినవారు కూడా ఈ పండగలకు దూరంగా ఉంటారు. కాగా పున్నాన కుటుంబాలకు చెందిన ఆడపిల్లలు మాత్రం.. వివాహం అనంతరం ఇంటి పేరు మారడంతో ఈ రెండు పండగలు చేసుకుంటారు. రెండు దశాబ్దాల కిందట ఈ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పున్నాన నరసింహుల నాయుడు ఈ పండగలు చేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.

నేడు మున్సిపల్ సమావేశం

ఇచ్ఛాపురం,అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) 29: మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో బుధవారం సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు జరిగే సమావేశానికి మున్సిపల్ అధికారులు, కౌన్సిల్ సభ్యులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

అన్నపూర్ణ సేవకు వితరణ

శ్రీకాకుళం కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి భక్తులు రిమ్స్‌లో నిర్వహిస్తున్న అన్నపూర్ణ సేవా కార్యక్రమానికి గుజరాతీపేటకు చెందిన కోరాడ ఇందిర రూ.10వేలు, పొందూరు మండలం లోలుగు గ్రామానికి చెందిన లోలుగు నూకరాజు రూ.10వేలు మంగళవారం అందజేశారు. సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు పాల్గొన్నారు.

చేపల పెంపకంతో ఆదాయం

ఆమదాలవలస, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విభిన్న జాతుల చేపల పెంపకంతో రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినే టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో వృత్తి విద్యా శిక్షణ ముగింపు కార్యక్రమంలో రైతులకు ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో మత్స్యశాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ బాలకృష్ణ, ఎంపీఈడీఏ (విశాఖపట్నం) డైరెక్టర్ ప్రసాద్‌నాయక్, నాక్సా కో-ఆర్డినేటర్ బాలాజీ, మత్స్యశాఖ సహాయ సంచాలకులు సంతోష్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

యునిక్స్ క్లబ్ పోర్టల్ ప్రారంభం

ఎచ్చెర్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ యూనివర్సిటీలో యునిక్స్ పేరుతో రూపొందించిన ఇన్నోవేషన్స్ క్లబ్ పోర్టల్‌ను వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మంగళవారం ప్రారంభించారు. యూనివ ర్సిటీ విద్యార్థులను ఎయిర్ స్పేస్, రొబోటిక్ తదితర రంగాల్లో నిపుణులుగా తీర్చిదిద్దడమే ముఖ్య లక్ష్యంగా ఈ క్లబ్ పనిచేయనుంది. కార్యక్రమంలో వర్సిటీ ఓఎస్‌డీ డాక్టర్ యు.కావ్య జ్యోత్స్న, ప్లేస్‌మెంటు ఆఫీసర్ కె.విద్యాసాగర్, డాక్టర్ పి.రవికుమార్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థిని ప్రతిభ



వినూత్నకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న క్యాంపస్ డైరెక్టర్

ఎచ్చెర్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ పీయూసీ విద్యార్థిని వినూత్న ఇటీవల నిర్వహించిన 9వ రాష్ట్ర జూనియర్ అంతర జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో మూడో స్థానాన్ని కైవసం సాధించింది. ఈ విద్యార్థినిని క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ అభినందించారు. కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, వెల్ఫేర్ డీన్ గేదెల రవి పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే కేసులు

పొందూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విలేఖరులతో మాట్లాడారు. బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలన్నారు. ● కింతలి జూనియర్ కళాశాలలో జరిగిన చోరీపై డీఎస్పీ విచారణ జరిపారు. ప్రిన్సిపాల్ సునీతను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్‌ఐ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే ఉద్యోగావకాశాలు

అరసవల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏ కోర్సు చదివినా, అందులో నైపుణ్యం ఉన్నవారికే ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ అన్నారు. మంగళవారం డీఆర్‌డీఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 'నైపుణ్య గణన-2024' జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యువత తమ నైపుణ్యాలను పెంపొందించు కోవాలని ఆయన కోరారు. జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఆటోమేషన్, కృత్రిమ మేధ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామస్వరాజ్యం

● వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం
● ఎమ్మెల్యే రవికుమార్

పొందూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం సాధ్యపడుతుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పొందూరులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం సచివాలయాలు, వలంటీర్ల పేరుతో గ్రామాల ను సర్వనాశనం చేసిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో వేసిన రోడ్లు తప్ప వైసీపీ పాలనలో అభివృద్ధే కనిపించలేదని విమర్శించారు. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం మండలంలో ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేస్తామన్నారు. చిలకపాలెం-రామభద్రపురం రాష్ట్ర రహదారిని హైవేకు అప్పగింగి నాలుగులైన్లగా మారుస్తామన్నారు. కన్న తల్లిని, తోడబుట్టిన చెల్లిని కోర్టుకు లాగిన దుర్మార్గుడు జగన్మోహన్‌రెడ్డి అని మండిపడ్డారు. విజయవాడ వరద బాధితులకు యంగ్‌స్టార్స్ అధ్యక్షుడు కె.శాంతారాం ఆధ్వర్యంలో సేకరించిన రూ.2 లక్షల చెక్కును రవికుమార్‌కు అందించారు. పార్టీ మండల అధ్యక్షుడు రామ్మోహన్, నాయకులు అన్నెపు రాము, సీపాన శ్రీరంగ, బలగ శంకరభాస్కర్, ఎ.చినరంగ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల పనులకు శంకుస్థాపన

ఆమదాలవలస, అక్టోబరు 29 (ఆంధ్రజ్యో తి): గ్రామాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయ మని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని శ్రీనివాసాచార్యులుపేట, అక్కుల పేట గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధు లు రూ.60లక్షలతో సీసీ రోడ్లు కాలువల నిర్మా ణానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అక్కు లపేటను పరిశ్రమల హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. ఈసర్లపేట వద్ద ఉన్న 60 ఎకరాల ప్రభుత్వ భూమిలో 400 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి గ్రామస్థులు సహకరిం చాలని కోరారు. జనవరి నుంచి గ్రామసభలు నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు కొత్త పించ న్లు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్ర మంలో సర్పంచ్‌లు బొడ్డేపల్లి గిరీపతి, బొడ్డేపల్లి వసుమతి, ఎంపీటీసీలు బొడ్డేపల్లి సుగుణ, తమ్మినేని బాలామణి, బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు తమ్మినేని చంద్ర శేఖర్, సనపల డిల్లీశ్వరరావు, నూకరాజు, ఉద య్‌కుమార్, తమ్మినేని అప్పలనాయుడు, ఎండ అప్పలనాయుడు, అధికారులు పాల్గొన్నారు.



ఆమదాలవలస: రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

'ఆ తీర్మానాలను రద్దు చేయాలి'

శ్రీకాకుళంఅర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస మండలం తొగరాం గ్రామంలో ఈ ఏడాది ఆగస్టు 23న గ్రామ పంచాయతీ ఆమోదం లేకుండా పలు అభివృద్ధి పనులకు చేసిన తీర్మానాలను రద్దు చేయాలని ఆ గ్రామ సర్పంచ్ తమ్మినేని వాణి సీతారాం కోరారు. ఈ మేరకు ఎంపీటీసీలతో కలసి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఆమె వినతి పత్రం అందించారు. గెలిచిన ప్రజా ప్రతినిధులే మండల సమావేశంలో పాల్గొనేలా చూడాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వైసీపీ నాయకుడు తమ్మినేని చిరంజీవి నాగ్ తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్ అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో మంగళవారం జిల్లాస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. 17 క్రీడంశాల్లో జరిగిన పోటీల్లో 156 మంది పాల్గొన్నారు. బ్యాడ్మింటన్, యోగా, టేబుల్‌టెన్నిస్, ఈత, చెస్, క్యారమ్స్ అథ్లెటిక్స్, కబడ్డీ తదితర అంశాల్లో ఎంపికలు జరిగాయి. ఎంపికైన క్రీడాకారులు నవంబరు 6 నుంచి విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్ తెలిపారు.

రిమ్స్‌లో మెరుగైన సేవలందించాలి

● ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్)లో రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మంగళవారం ఆయన ఆసుపత్రిలో వైద్యులతో సమీక్ష నిర్వహించారు. రిమ్స్‌లో ఎక్కడా చూసినా సమస్యలు కనిపిస్తున్నాయని, దీనివల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సిబ్బంది కొరత కూడా అధికంగా ఉందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిధులు కేటాయించకపోవడంతో ఆసుపత్రి ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేద న్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి ఎమ్మెల్యే 20 సీలింగ్ ఫ్యాన్లు, స్టేడియం కోఆర్డినేటర్ లక్ష్మణరావు 25 సీలింగ్ ఫ్యాన్లు, అంధవరపు సంతోష్ 100 ట్యూబ్ లైట్లు, శ్రీనివాసరావు (పీఎస్ కా లనీ) 20వాల్ ఫ్యాన్లు అందజేశారు. కార్యక్రమంలో రిమ్స్ ప్రిన్సిపాల్ వెంకటాచలం, ఆర్ఎంవో సుభాషిణి, సూపరిం టెండెంట్, అధికారులు, సిబ్బంది, కూటమి నేతలు, కార్యకర్తలు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కార్యకర్తల సంక్షేమానికి కృషి

● విజయనగరం ఎంపీ కలిశెట్టి

జి.సిగడాం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మంగళవారం మదుపాం, దేవరవలస గ్రామాల్లో నిర్వహిం చిన టీడీపీ సభ్యుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి బీమాతో పాటు విద్య, వైద్య ఖర్చులను పార్టీ అందజేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధితో పాటు సువర్ణ పాలన అందించే దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఎటువంటి విభేదాలకు తావివ్వకుండా గ్రామాల అభివృద్ధిపై నాయకులు, కార్యకర్తలు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బోగాది అప్పలనాయుడు, వెంకటరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, నాయకులు టంకాల మౌళీశ్వరరావు, కుదిరెళ్ల బుజ్జి, కూనుబిల్లి కూర్మారావు, బెవర జగన్నాధరావు, అరెళ్ల గోల్లాజీ, తదితరులు పాల్గొన్నారు.



మదుపాంలో మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

రొమ్ము కేన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించాలి

అరసవల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రొమ్ము కేన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స ఎంతో సులభతరం అవుతుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మహిళా విభాగం శ్రీకాకుళం అధ్యక్షురాలు డాక్టర్ దుంగ హర్షవల్లి పేర్కొన్నారు. బ్రెస్ట్ కేన్సర్ మాసోత్స వాల్లో భాగంగా మంగళవారం శ్రీకాకుళం నగ రంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో రొమ్ము కేన్సర్‌పై అవగా హన సదస్సు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ పథకంలో కేన్స ర్‌ను చేర్చి ఉచితంగా చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. శరీరంలో ఎక్కడైనా వాపు లేదా గడ్డలు వస్తే సత్వరమే చికిత్స చేసుకోవాలని సూచించారు. కేన్సర్‌పై అవగాహన కల్పిస్తూ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమలో రిమ్స్ ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు, నగరంలోని మహిళా వైద్యులు, యూనిట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పుచ్చలపల్లి ఆశయం సజీవం

● శ్రీకాకుళంలో విగ్రహావిష్కరణ

శ్రీకాకుళం కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): తన యావదాస్తిని ప్రజల కోసం ధార బోసి నిరాడంబర జీవితాన్ని గడిపిన పుచ్చల పల్లి సుందయ్య ఆశయం ఎప్పటికీ సజీవంగా నిలుస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీని వాసరావు అన్నారు. మంగళవారం నగరంలోని స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనం, గాంధీ మందిరంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం సుందరయ్య కృషి చేశారని అన్నారు. సమాజం కోసం పనిచేసే ఎవరైనా పుచ్చలపల్లిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంత రం విగ్రహదాత వీజీకే మూర్తి, శిల్పి దివిలి హేమచంద్రను గాంధీ మందిర ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర సభ్యుడు బెండి తులసీదాస్, ప్రముఖ రచయి త అట్టాడ అప్పలనాయుడు, సీనియర్ జర్నలి స్టు నల్లి ధర్మారావు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం

జాతీయస్థాయి క్రీడాకారులకు అభినందన

శ్రీకాకుళం స్పోర్ట్స్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి సపక్ తక్రా పోటీలకు ఐదుసార్లు ప్రాతినిధ్యం వహిం చిన సురవపు ప్రేమశ్రీని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు మంగళవారం అభినందించారు. ప్రేమశ్రీతో పాటు కోచ్ అర్జునరెడ్డి, మరో ఇద్దరి క్రీడాకారులను సన్మానించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబ్జీ, శవ్వాన ఉమామహేశ్వరి, శవ్వాన వెంకటేశ్వ రరావు, పాల్గొన్నారు. ● జాతీయస్థా యి పెన్సింగ్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు ఎల్.డార్విన్, పి.అమనీను జిల్లా ఫెన్సింగ్ సంఘం అధ్యక్షుడు బలభద్రుని రాజా అభినందించారు. ఈ పోటీలు నవంబరు 17 నుంచి జమ్ముకశ్మీర్‌లో జరుగుతాయని కోచ్ తెలిపారు.

ఘనంగా జాతీయ ఆయుర్వేద దినోత్సవం

అరసవల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో జాతీయ ఆయుర్వేద దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. భగవాన్ ధన్వంతరీ చిత్రపటానికి సీనియర్ ఆయుష్ వైద్యాధికారి డా.జగదీష్, తదితరులు పూలమాల వేశారు. డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలోని ఆయుర్వేద వైద్యశాలలో ప్రతిరోజూ ఉదయం 9నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత డీఈవో బలివాడ మల్లేశ్వరరావు, జాడ చంద్రశేఖరరావు, కొంక్యాన మురళీ, యోగా మురళీ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

హస్త కళలను ఆదరించాలి

అరసవల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపమైన ప్రాచీన హస్తకళలను ఆదరించి ఆ కళాకారులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఫారెస్టు ఆఫీసు ఎదురుగా హ్యాండ్లూమ్ హ్యాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు.

కత్తెర పురుగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

రణస్థలం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్నకు ఆశించే కత్తెరపురుగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ సహాయ సంచాలకుడు వి.శ్రీనివాసరావు అన్నారు. పాతర్లపల్లి, కొవ్వాడలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కత్తెర పురుగు నివారణకు 100 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయోట్‌లో 500 మీల్లీ లీటర్ల వేపనూనె పిచికారి చేయాలని సూచించారు. ఏవో విజయభాస్కర్ ఉన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే ప్రయోజనం

ఎచ్చెర్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కుప్పిలి, బుడగట్లపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి వై.సురేష్ మాట్లాడుతూ వరిలో సుడిదోమ సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు. మత్స్యశాఖ అధికారి ఎస్.ముసలినాయుడు పీఎంఎంఎస్‌వై పథకంపై సబ్సిడీపై ఇచ్చే వలలు, ఇంజన్లు తదితర వాటిని వివరించారు. కార్యక్రమంలో బుడగట్లపాలెం సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు, మాజీ సర్పంచ్ అలుపన నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల వివరాలు సరిచూసుకోండి

సోంపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్-2024 వరి పంట నమోదు వివరాల తుది జాబితాలో రైతులు తమ పేర్లు సరిచూసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి రైతులకు సూచించారు. బారువ, జలంతర, సోంపేట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పందులు పొలాల్లోకి వచ్చే దారిలో కత్తిరించిన తల వెంట్రుకలు చల్లడం, కుళ్లిన కోడిగుడ్ల ద్రావణం గడ్డిమీద పిచికారి చేయటం, గట్ల చుట్టూ గాలికి శబ్దం వచ్చేలా సీసాలు కట్టడం వల్ల కొంత మేర పందులు బెడదను అరికట్టవచ్చునని రైతులకు సూచించారు.

పదోన్నతులు కల్పించాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎం.వెంకటేశ్వరావును రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం కలిశారు. అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ మహిళ మృతి

● మరిదిపై హత్యాయత్నం కేసు నమోదు

నందిగాం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మర్లపాడుకు చెందిన తర్ని వరలక్ష్మిపై కర్రతో దాడి చేసి ఆమె మృతికి కారణమైన మరిది జానకిరామయ్యపై హత్యకేసు నమోదు చేసినట్లు టెక్కలిక రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మర్లపాడు గ్రామానికి చెందిన వరలక్ష్మి భర్త మృతిచెందగా కుమార్తెలకు వివాహమవడంతో ఆమె ఒంటరిగా ఉంటోంది. ఆమె ఇంటి వెనుక భాగంలో మరిది జానకిరామయ్య ఉంటున్నారు. ఆస్తికి సంబంధించిన వివాదాలు తరచూ జరుగుతుండడంతో గ్రామపెద్దలు అనేక పర్యాయాలు అవగాహన కలిగించి తగువులను చల్లార్చారు. అయితే ఈనెల 22న వరలక్ష్మి పని నుంచి వచ్చిన జానకిరామయ్యను తన భర్తకు చెందిన పంచె ఎందుకు కున్నావంటూ పంచెను లాగేసింది. దీంతో కోపోద్రిక్తుడైన జానకిరామయ్య వదిన తలపై సమీపంలో ఉన్న కర్రతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. దీంతో ఆమెను టెక్కలి జిల్లా ఆసుపత్రికి, అక్కడి నుంచి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. ఆమె కుమార్తె రేవతి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో టెక్కలి రూరల్ సీఐ శ్రీనివాసరావు, నందిగాం ఎస్‌ఐ షేక్‌మహ్మద్ ఆలీ సిబ్బందితో కలిసి మృతురాలు వరలక్ష్మి ఇంటిని పరిశీలించారు. ఆ ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రణస్థలానికి చెందిన వృద్ధురాలు..


నారాయణమ్మ (ఫైల్)

రణస్థలం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యడ్ల నారాయణమ్మ (78)అనే వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. షిర్డీ సాయిబాబా ఆలయం ఎదురుగా జాతీయ రహదారిని దాటుతున్న నారాయణమ్మను శ్రీకాకుళం నుంచి రణస్థలం వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె మనువడు యడ్ల రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్‌పురం ఎస్‌ఐ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం


మణికంఠ

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలు పంచాయతీ రాయిపాడు గ్రామానికి చెందిన జాగిలింకి మణికంఠ (25) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. మణికంఠ ఈ నెల 13న రాత్రి 7 గంటల నుంచి కనిపించడం లేదని తండ్రి రామారావు రూరల్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ కె.రాము కేసు నమోదు చేశారు.

హైదరాబాద్‌లో గుండెపోటుతో యువకుడి మృతి

● క్రికెట్ ఆడిన తరువాత తుదిశ్వాస విడిచి..


కృష్ణప్రసాద్ (ఫైల్)

నరసన్నపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సత్యవరం గ్రామానికి చెందిన యాగళ్ల కృష్ణప్రసాద్ అలియాస్ సంతోష్ (25) ఆదివారం హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. యాగళ్ల రామమూర్తినాయుడు, సూర్యకుమారి పెద్ద కుమారుడు సంతోష్ బీటెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఓ ప్రైవేటుకంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. క్రికెట్‌పై మక్కువతో ఆదివారం ఉప్పల్ స్టేడియంలో స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడాడు. ఆ తరువాత రూంకి వచ్చి వాంతులు చేసుకుని నోటి వెంబడి నురగలు కక్కుకుంటూ మృతిచెందాడు. స్నేహితులు అనుమానాస్పద మృతిగా భావించి స్నేహితులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. సంతోష్‌కు క్రికెట్ అంటే ఊపిరి.. ఆ క్రికెట్ ఆడి ఊపిరిని వదిలేశాడని స్నేహితులు, బంధువులు బోరున విలపిస్తున్నారు. స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఇది ప్రమాదం కాదా..!

నిర్లక్ష్యం

కొత్తూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వీరనారాయణపురం గ్రామం సమీపంలో డోల గెడ్డపై ఉన్న కల్వర్టు ఒక వైపు కుంగి ఏడాది గడిచినా ఇప్పటి వరకు ఎటువంటి మరమ్మతులు చేపట్ట లేదు. పైగా కల్వర్టు బాగులేదంటూ దానికి అడ్డంగా రోడ్డుపై గోడ నిర్మాణం చేపట్టారు. అయితే మాకువరం, దిమిలి, కుద్దిగాం, రాయల, పొన్ను టూరు గ్రామాల రాకపోకలకు ఇదే ప్రధాన రహదారి.. అలాగే అంధ్రా నుంచి పర్లా కిమిడికి ఈ మార్గం గుండానే వెళుతుంటారు. రోడ్డుకు అడ్డంగా గోడ ఏర్పాటు వల్ల రోడ్డు కుంచిం చుకుపోయి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాద సూచిక గా ఏర్పాటు చేసిన ఈ గోడ వద్ద తిరగాల్సి రావడంతో ప్రమాదాలు సంభవి స్తున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణం పూర్తి చేసి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.


రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన గోడ

నిత్యం ట్రాఫిక్ కష్టాలు

ఇబ్బందులు

జలుమూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చల్లవానిపేట నాలుగురోడ్ల కూడలిలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు భారీ వాహనాలు సైతం నిలిచిపోతుండడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నా రు. మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఊకలోడులు రావడంతో వాహనాలు తప్పుకునేందుకు వీలు లేక సుమారు 20 నిమషాల పాటు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి పోయాయి. అధిక లోడుతో ఊక లారీ లు వస్తుండడంతో పక్కకు తప్పుకునేందుకు ఇబ్బందిగా ఉంటోందని, రోజూ ఇదే పరిస్థితి అని పలువురు వాహన చోదకులు పేర్కొంటు న్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసు కోవాలని స్థానికులు కోరుతున్నారు.


చల్లవానిపేట కూడలిలో నిలిచిపోయిన వాహనాలు

టీడీపీ సభ్యత్వంతో రూ.5 లక్షల బీమా: ఎమ్మెల్యే బగ్గు

పోలాకి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో రూ.5 లక్షల బీమాతో పాటు పలు రాయితీలు లభిస్తాయని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. మంగళవారం దీర్ఘాశి రచ్చబండ వద్ద సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సభ్యత్వం కలిగిన కార్యకర్త దురదృష్టవశాత్తు మృతి చెందితే దహనసంస్కారాలకు రూ.10 వేలు అందచేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లి సూరిబాబు, ఎంవీ నాయుడు, బైరి భాస్కరరావు, మెండ దాస్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. దీర్ఘాశిలో ఎదుర్కొంటున్న సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు.


పోలాకి: పార్టీ సభ్యత్వాన్ని చూపిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

జలుమూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): లింగన్నాయుడుపేట కి చెందిన ధర్మాన భానుప్రసాద్‌కు శస్త్ర చికిత్సకు సీఎంఆర్ఎఫ్ కింద రూ. 1.77 లక్షలు మంజూరు కాగా ఆ చెక్కును మంగళవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కింజరాపు సత్యం, దుంగ స్వామిబాబు, పంచిరెడ్డి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం ఉంటేనే గౌరవం

మెళియాపుట్టి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం ఉంటేనే సమాజంలో గౌరవం ఉంటుందని మాజీ ఎంపీపీ బైరిశింగి లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం పద్మ పంచాయతీలో టీడీపీ సభ్యత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. గిరిజనుల అభి వృద్ధి టీడీపీ ప్రభుత్వం తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మర్రిపాడు-సి సర్పంచ్ రవ్వల అనురాధ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.


మెళియాపుట్టి: పార్టీ సభ్యత్వంపై అవగాహన కల్పిస్తున్న టీడీపీ నేతలు

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

కోటబొమ్మాళి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వాండ్రడ గ్రామ సమీపంలో హైవే మార్గంలో సర్వీస్ రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మీనాక్షి తన ద్విచక్ర వాహనంపై నిమ్మాడ జంక్షన్ నుంచి నరస న్నపేట వెళుతుండగా ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్రవాహనం నుజ్జు నుజ్జు కాగా మీనాక్షి తీవ్ర గాయాలపాలైంది. వెంటనే ఆమెను 108లో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈమె నిమ్మాడ జంక్షన్‌లో పూజా సామగ్రి విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. ఈ ఘటనపై పోలీసులను సంప్రదించగా ఇంత వరకు కేసు నమోదు చేయలేదని తెలిపారు.

గడ్డిమందు పిచికారీపై ఫిర్యాదు

మెళియాపుట్టి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జాడుపల్లిలో తనకు చెందిన 53 సెంట్లలో వేసిన వరిపంటపై గ్రామానికి చెందిన కొందరు గడ్డిమందు పిచికారీ చేశారని, దీంతో పంట పాడై పోయిందని మంగళవారం కలమట సూర్యనారాయణ ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. పంట చేతికి వస్తున్న నేపథ్యంలో రాత్రి సమయంలో మందు పిచికారీతో నష్టపోయానని ఆయన వాపోయాడు. ఈ మేరకు ఎస్‌ఐ పంటను పరిశీలించారు. పూర్తి స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

బాలలను పనిలో పెడితే చర్యలు

పలాస, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బాల కార్మికులను పనుల్లో పెడితే సంబంధిత యజమాను లపై చర్యలు తీసుకుంటామని కార్మిక శాఖ అధికారి ఎం.విజయ్‌కుమార్ హెచ్చరించారు. చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో మంగళవారం షాపింగ్ మాల్స్, హోటల్స్, వాషింగ్ సెంటర్లు, పెట్రోలుబంకులను సందర్శించారు. కార్యక్రమంలో సీఆర్ఎంటీ యు.అప్పలరాజు, చైల్డ్ లైన్ ప్రతినిధులు స్వాతి, సుజాత, పోలీసులు పాల్గొన్నారు.

చెరువుల్లో పూడిక తీయించండి

● మునిసిపల్ సమావేశంలో 'గురిటి'

పలాస, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభమవుతున్నందున చెరువుల్లో పూడికలు తీసి సిద్ధం చేయాలని సీనియర్ కౌన్సిలర్ (టీడీపీ) గురిటి సూర్యనారాయణ కోరారు. చైర్మన్ బళ్ల గిరిబాబు అధ్యక్షతన మునిసిపల్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ.. కార్తీకమాసంలో శివభక్తులు అధిక సంఖ్యలో చెరువుకు వస్తారని, కనీస సౌకర్యాలు లేకుంటే ఎలా అని ప్రశ్నించారు. అలాగే పట్టణ పరిధిలోని ఇతర చెరువుల్లోని చెత్తను తొలగించి భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. చైర్మన్ బళ్ల గిరిబాబు మాట్లాడుతూ.. చెరు వుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, రెండు వారాల్లో పూడికలు తీయడం, చెరువులో బ్లీచింగ్ చల్లి శుభ్రం చేయా లని కమిషనర్ రామారావును ఆదేశించారు. వార్డుల్లో విద్యుత్ స్తంభాలు వేయాలని 18వ వార్డు కౌన్సి లర్ సనపల సింహాచలం కోరారు.


మాట్లాడుతున్న కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ

గౌతు శిరీషను విమర్శిస్తే సహించేది లేదు

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గౌతు శిరీషను విమర్శిస్తే సహించేది లేదని టీడీపీ నాయకులు మాజీ మంత్రి అప్పలరాజునుద్దేశించి అన్నారు. మంగళవారం అక్కుపల్లిలో తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుల్లోజు శశిభూషణ్, సాగర మత్స్యకార సొసైటీ అధ్య క్షుడు కాస చలపతి, మాజీ వైస్ ఎంపీపీ దాసరి జేజేరావు విలేకరులతో మాట్లాడారు. నువ్వలరేవు మత్స్యకార విద్యార్థి గణేష్ అనుమానాస్పదంగా మృతి చెందితే కనీసం ఎఫ్ఐఆర్ లేకుండా అప్పటి మంత్రి అప్పలరాజు మేనేజ్ చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు సింగు పల్లి బాలకృష్ణ, సాతుపల్లి కామేశ్వరరావు, చొక్కర చిరంజీవి, బత్తిని మహేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

టెక్కలి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పోలీసుల అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకమని సీఐ ఎ.విజయ్‌కుమార్ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం టెక్కలిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 52 మంది పోలీసు సిబ్బంది, యువకులు రక్త దానం చేశారు. జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గుండె, కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 256 మంది మహిళలు, వృద్ధులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు నారాయణ స్వామి, రఘునందన రావు, రాము, సిబ్బంది పాల్గొన్నారు.


రక్తదాతను అభినందిస్తున్న సీఐ విజయ్‌కుమార్

పలాస ఆర్డీవోగా గ్రంధి వెంకటేష్

పలాసరూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పలాస ఆర్డీవోగా గ్రంధి వెంకటేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఇక్కడ ఆర్డీవో పని చేసిన సుదర్శన దొర అస్వస్థతకు గురికాగా ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి వ్యవహరిం చిన సంగతి తెలిసిందే. గ్రంధి వెంకటేష్‌ను ప్రభుత్వం ఆర్డీవోగా నియమిస్తూ ఉత్తర్వులిచ్చింది. ఈ సందర్భంగా ఆయనకు డీటీలు, సిబ్బంది బొకే అందించి అభినందనలు తెలిపారు.


ఆర్డీవో వెంకటేష్‌ను అభినందిస్తున్న సిబ్బంది

'అపార్'పై నిర్లక్ష్యం వద్దు

నరసన్నపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల వివరాలను అపార్‌లో నమోదులో నిర్లక్ష్యం విడనాడా లని డిప్యూటీ డీఈవో విజయకుమారి హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో నాలుగు మండలాలకు చెందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, ఎంఈవోలతో సమీక్షించారు ఎంఈవోలు పి.దాలినాయుడు, నాయక్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

హిరమండలం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): హిరమండలం చిన్న కోరడ వీధి సమీపంలో మంగళవారం ఎస్‌ఐ ఎండీ.యాసీన్ వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని ద్విచక్ర వాహనదారులకు సూచించారు.

న్యూస్ బాక్స్

చంద్రబాబు చొరవతోనే రైతులకు భూహక్కు

పోలాకి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో తీసుకువచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ తో రైతులు హక్కులను కోల్పోయారని,కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ చట్టాన్ని రద్దు చేసి సీఎం చంద్రబాబు భూహక్కు కల్పించారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం తలసముద్రం పంచాయతీ కొల్లివలసలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సురేష్‌కుమార్, నేతలు సూరపునారాయణ దాస్, బైరి భాస్కరరావు, ఎంవీనాయుడు, లుకలాపు రాంబాబు, ప్రగడ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆహార శుద్ధి పరిశ్రమలపై అవగాహన

పలాసరూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆహార శుద్ధి పరిశ్రమలపై అవగాహన పెంచుకోవాలని, వివిధ సబ్సిడీల వివరాలు తెలుసుకోవాలని ఏపీఎంఐపీ, ఏపీ ఎఫ్‌పీఎస్ జిల్లా అధికారి ఆర్. శ్రీనివాస్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఆహారశుద్ధి ప్రాసెస్ ఆధ్వర్యంలో వ్యాపారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. నాబార్డు డీడీఎం రమేష్ కృష్ణ, ఉద్యానవన అధికారులు సీహెచ్ శంకర్‌దాస్, సునీత, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ అధికారి సునీల్ కుమార్, వ్యాపారులు మల్లా శ్రీనివాసరావు, మల్లా రామేశ్వరరావు, సుడియా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్ ప్రకటించాలి

టెక్కలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయరంగ సమస్యలపై ప్రభుత్వం శ్రద్ధ చూపాలని, డీఏ ఏరియర్స్, ఐఆర్ ప్రకటించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాలకపాటి రఘువర్మ డిమాండ్ చేశారు. మంగళవారం లింగాలవలస, రావివలస, టెక్కలి బాలికోన్నత పాఠశాల, ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఏపీటీఎఫ్ నాయకులు అనిల్ కుమార్, నేతాజీ పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

కోటబొమ్మాళి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని మంగళవారం కోటబొమ్మాళి ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా పంగ సింహాచలం, సహాధ్యక్షులుగా రొక్కం నీలకంఠేశ్వరరావు, దుక్క కమలాభాయిలను ఎన్నుకున్నారు.